విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 10 జులై 2024 | 8 పేజీలు

ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తిచేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం నందు జిల్లా కలెక్టర్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరు క్లస్టర్ల వారీగా పని దినాలు చేపడుతున్న పనులు, తదితర అంశాలపై డ్వామా పిడి ఎన్.రాజ శేఖర్ తో కలసి ఏ పి డి లు,ఏ పి ఓ ల తో సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ...జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పని దినాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం కల పనులపై దృష్టి సారించాలని ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలన్నారు.

2

రేపే ట్రిపుల్ ఐటీ ఫలితాల విడుదల

- 22 నుండి కౌన్సిలింగ్

విశాలాంధ్ర-తొట్టంబేడు : ఎపుడెపుడా అని ఎదురుచూస్తున్న... ఆంధ్రప్రదేశ్‌లోని ట్రిపుల్ ఐటీ ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల వారీగా జనరల్ కౌన్సెలింగ్ కు ఎంపిక చేసిన విద్యార్థుల తుది జాబితా ఈ నెల 11వ తేదీ గురువారం విడుదల చేయనున్నారు. ఎంపిక జాబితా విడుదలైన తరు వాత చోటు దక్కించుకున్న విద్యార్థుల ధృవపత్రాలను పరిశీలిం చనున్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు నూజివీడు క్యాంపస్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో ధృవపత్రాల పరిశీలన ఉంటుంది. ఇక ఇడుపులపాయ క్యాంపస్‌లో ఈ నెల22, 23వ తేదీల్లో... ఒంగోలు క్యాంపస్‌లో ఈ నెల 24, 25వ తేదీల్లో పరిశీలన ఉంటుంది. శ్రీకాకుళం క్యాంపస్‌లో

2

అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి

అధికారుల పరుగులు

మూఢ విశ్వాసాలు నమ్మొద్దని అవగాహన

విశాలాంధ్ర-తొట్టంబేడు :

విశాలాంధ్ర కథనం సంచలనం సృష్టించింది. అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి అధికారులు పరుగులు తీశారు. మూఢ విశ్వాసాలు నమ్మొద్దని గిరిజనులకు వారు అవగాహన కల్పించారు. మూఢ నమ్మకంతో ఊరు విడిచి వెళ్లి పోయిన కొన్ని కుటుంబాలను వెనక్కు పిలిపించారు. మిగిలిన కుటుంబాలను కూడా త్వరలో వెనక్కు రప్పించే బాధ్యత స్థానికంగా పని చేసే అధికారులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే...విశాలాంధ్రలో మంగళవారం 'వేప చెట్టు ఎండి పోయిందని...' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గుండేలిగుంట పంచాయతీ పరిది, లోని అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి వెళ్లి విశాలాంధ్ర కథనంపై విచారణ జరపాలని తొట్టంబేడు మండల అధికారులను ఆదేశించారు.

2లో

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను

సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తా

- తిరుపతి ఎమ్మెల్యేఆరని శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి :

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తుందని తిరుపతిలో బాధితులు అధిక సంఖ్యలో ఉన్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తిరుపతి శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులు పేర్కొన్నారు.

తరువాయి 2లో

డయేరియా బాధితులకు

మెరుగైన వైద్యం అందించండి

- రుయాలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులకు పరామర్శ
- ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్ : రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న (పాస్ మనో వికాస్) మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో వసతి పొందుతున్న డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న (పాస్ మనో వికాస్)

2

అధికారుల పరుగులు

(మొదటి పేజీ తరువాయి) ఆర్డీవో రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు తహసీల్దారు శివరామసుబ్బయ్య, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, తొట్టంబేడు పోలీసులు తమ సిబ్బందితో కలసి అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి వెళ్లారు. గిరిజనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండిన వేప చెట్టు... అనారోగ్యం బారిన పడిన గిరిజనులు గురించి వారు వివరించారు. అనంతరం అధికారులు ఆ గ్రామంలో గిరిజనులు తాగే నీటిని పరిశీలించారు. తాగునీరు కలుషితం అయినట్లు గుర్తించారు. తాగునీరు కలుషితం, తీవ్రమైన ఎండ కారణంగా గిరిజనులు అనారోగ్యం బారిన పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తాగునీటి పైపులైను బాగు చేయించని పంచాయతీ కార్యదర్శి ఆనంద్ బాబును అధికారులు మందలించారు. తాగునీటి వ్యవస్థను 24గంటల వ్యవదధిలో బాగు చేయాలని ఆనంద్ బాబును ఆదేశించారు అనంతరం అధికారులు అందరూ కలసి గిరిజనులతో సమావేశం నిర్వహించారు. మూఢ నమ్మకంతో ఊరు విడిచి వెళ్లిన వారి వివరాలను సేకరించారు. పిశాచి భయంతో సమీప గ్రామాల్లో తలదాచుకుంటున్న కొన్ని కుటుంబాల వారిని గిరిజన కాలనీకి రప్పించారు. వారితో సమావేశం నిర్వహించారు. వేప చెట్టు ఎండి పోవడాపనికి గల కారణాలను వివరించారు. ఆ చెట్టు పక్కనే మరో వేప మొక్క పెంచుతామని హామీ ఇచ్చారు. ఇక మూఢ నమ్మకంతో ఊరు విడిచి వెళ్లిన గిరిజనుల వివరాలను సేకరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటా సర్వే చేసి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఊరు విడిచి వెళ్లిన పది కుటుంబాలను వెనక్కు రప్పించారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే గిరిజన కాలనీకి రప్పించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా ఈ గిరిజన కాలనీ ఏ ఒక్క కుటుంబానికి ఉపాధి హామీ కార్డు లేదని అధికారుల విచారణలో తేలింది. అదేవిధంగా ఆధార్, రేషన్ కార్డులు కూడా వీరికి లేక పోవడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. వీలైనంత త్వరగా ఈ గిరిజన కాలనీ వాసులకు ఆధార్, రేషన్ కార్డులు, ఉపాధి హామీ పనులు చేసుకోవడానికి జాబ్ కార్డులు మంజూరు చేయించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాగా అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో అమ్మవారిని శాంతింప చేయడానికి గిరిజనులు పొంగళ్లు పెట్టారు .ప్రగతి సంస్థచే అవగాహన విశాలాంధ్రలో ప్రచురితమైన కథనంతో ప్రగతి స్వచ్ఛంధ సంస్థ డైరెక్టరు కేవీ రమణ వెంటనే స్పందించారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట పంచాయతీ అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి వెళ్లి పరిస్థితులు పరిశీలించాలని ఆ సంస్థ శ్రీకాళహస్తి సిబ్బంది ప్రభాకర్, రామచంద్రకు సూచించారు. కేవీ రమణ సూచనల మేరకు ప్రభాకర్, రామచంద్ర కలసి అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి వెళ్లారు. తాగునీటిని వారు పరిశీలించారు. వేప చెట్టు ఎండి పోవడానికి గల కారణాలు వివరించారు. మూఢ నమ్మకాలతో ఊరు విడిచి వెళ్లొద్దని వారు గిరిజనులకు సూచించారు. అదేవిధంగా గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని... గ్రామస్థులు ఎవరూ ఊరు విడిచి వెళ్ల కూడదని వారికి సూచించారు.

సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తా

(మొదటి పేజీ తరువాయి) మంగళవారం ఉదయం అగ్రిగోల్డ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు డా. టీ.జనార్ధన్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసులు నేతృత్వంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ఎమ్మెల్యే నివాసంలో విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షలు మంది అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 5000 కోట్ల రూపాయలు దాకా డిపాజిట్లు చెల్లించాలని అయితే సంస్థ ఆస్తులు రూ.30 వేల కోట్ల పైగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో చనిపోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించే పరిస్థితి వుండేదని అయితే గత ప్రభుత్వం బాధితుల పట్ల నిర్లక్ష్యధోరణి వహించిందని తెలిపారు. తిరుపతి సమీపంలోని ముంగిలి పట్టువద్దవున్న గణేష్ వనంలో 300 మందికి పైగా బాధితులు సంస్థకు డబ్బులు చెల్లించినా నేటికి రిజిస్ట్రేషన్ కాకుండా కాలయాపన చేస్తున్నారని తెలియజేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని సత్వరం అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకో వాలని వారు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరి స్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె. జయచంద్ర, సుశీల ఈశ్వరయ్య, సురేంద్ర, పణి కుమార్, చంద్రశేఖర్, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

(మొదటి పేజీ తరువాయి)మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల డయేరియా బాదితులు ఉండే వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది డయేరియా బాధితులలో ఇద్దరు మరణించడం జరిగిందని, మిగిలిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అందులో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్థానిక స్విమ్స్ ఆసుపత్రికి తరలించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను ఎన్‌జిఓ ఆధ్వర్యంలో నడుస్తున్నదని తెలిపారు. ఈ ఆశ్రమంలో సుమారు 6 సంవత్సరాల నుండి 45 సం.. లోపు వయసు గల 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. జూలై 6వ తేదీన మద్యాహ్నం అల్పాహారం తీసుకున్న తర్వాత ఆదివారం ఉదయం నుండి కొంతమందికి వాంతులు, విరోచనాలు అయిన వారికి మెట్రోజెల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వారికి అందించడం జరిగిందని, అయినప్పటికీ వారికి డయేరియా కంట్రోల్ కాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం సోమవారం ఉదయం వారిని సదరు ఎన్జీఓ రుయా ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. జిల్లా యంత్రాంగం పూర్తిగా డయేరియా నియంత్రణ కొరకు అనేక చర్యలు చేపడుతున్నా మంగళవారం రోజు ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని కలెక్టర్ అన్నారు. ఆశ్రమంలో ఉన్న మిగిలిన పిల్లలు కూడా డయేరియా బారిన పడకుండా వారికి ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకునే విధంగా అన్నిరకాల చర్యలు జిల్లా యంత్రాంగం చేపడుతోందని తెలిపారు. అనంతరం స్థానిక పద్మావతి పురంలోని (పాస్ మనో వికాస్) మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. మానసిక దివ్యాంగుల ఆదర్శ ప్రత్యేక పాఠశాలలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో త్రాగునీరు, వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. ఆశ్రమంలో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ తో శుభ్రపరిచి స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన ఆహారం వారికి అందించాలని ఆశ్రమ సిబ్బందికి తెలిపారు. ఆశ్రమంలోని ఇతర పిల్లలకు డయేరియా బారిన పడకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యులు అందుబాటులో ఉండేలా ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రిశాంత్ రెడ్డి, డిఎంహెచ్ఓ శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా మరియు వయోవృద్ధుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల జనరల్ సెక్రెటరీ బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తిచేయండి : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి) జిల్లాలో చేపడుతున్న ఫారం ఫాండ్స్ ,ఫీడర్ ఛానల్ పనులు, అమృత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, సప్లై ఛానల్ హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్, తదితర పనుల కు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు.హార్టికల్చర్ ప్లాంటేషన్ భాగంగా మొక్కల నాణ్యత ను పరిశీలించేందుకు మండల స్థాయిలో ఉద్యాన శాఖ అధికారి ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా నర్సరీలను తనిఖీ చేసిన అనంతరం రైతులు ఆ మొక్కల్ని వినియోగించు కునేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మ్యాంగో ప్లాంటేషన్ ఎక్కువ గా కలదని,కావున మొక్కల నాణ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.క్లస్టర్ల వారీగా చేపట్టే పనులలో లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా ఉండాలని వారికి పని దినాలు కల్పించాలని తెలిపారు.ఉపాధి హామీ పథకం యొక్క నియమ నిబంధనలను తప్పక పాటిస్తూ పనులను చేపట్టాలని,లక్ష్యాల సాధన లో నిర్లక్ష్యం తగదని 10 రోజులకు గాను క్లస్టర్ల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తరువాత ఈ అంశంపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు..జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జూలై వరకు 40 లక్షలు పని దినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 26,43,361 పని దినాలను కల్పిస్తూ 66% లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, జూలై మాసానికి గాను 16 లక్షల పది దినాలు పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని డ్వామా పిడి కలెక్టర్ కు వివరించారు.

రేపే ట్రిపుల్ ఐటీ ఫలితాల విడుదల

(మొదటి పేజీ తరువాయి) ఈ నెల26, 27వ తేదీల్లో ధృవపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. స్పెషల్ కేటగిరీ ధృవపత్రాల పరిశీలనకు ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 5వ తేదీతో పూర్తయింది. ఇందులో స్పోర్ట్స్, బీఏసీ, పీహెచ్, ఎన్సీసీ కేటగిరీకి చెందిన విద్యా ర్థులు ఉన్నారు. మొత్తం మూడు దశల్లో కౌన్సెలింగ్... పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటారు. మొత్తం మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న తర్వాత కౌన్సెలింగ్ కు పిలుస్తారు. ఆర్జీయూకేటీ వెబ్ సైట్ నుంచి విద్యార్థులు కాల్ లెటర్ డౌన్ లోడ్ చేసుకుని నిర్ణీత తేదీల్లో కౌన్సెలింగ్ కు హాజరు కావాల్సి ఉంటుంది. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. హాస్టల్ వసతి ఉంటుంది.ఒక్కొ ట్రిపుల్ ఐటీకి 1,000 సీట్లు..ఈ ఏడాది ఏకంగా 53,863 దరఖాస్తులు వచ్చాయి. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1,000 సీట్లు చొప్పున మొత్తం నాలుగు వేలు సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 400 సీట్లు ఉన్నాయి. మొత్తం నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆ సీట్లకు 53,863 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో సీటుకు దాదాపు 13 మంది పోటీ పడుతున్నారు. దరఖాస్తు చేసుకున్నవారిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 23,006 మంది బాలురు కాగా, 30,857 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 50,132 మంది దరఖాస్తు చేసుకోగా... తెలంగాణ విద్యార్థులు 3,693 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలను మినహాయించి ఇతర రాష్ట్రాల విద్యార్థులు 38 మంది దరఖాస్తు చేసుకున్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే...పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా మెరిట్ పద్దతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ సీట్లను ఏపీ, తెలంగాణ విద్యార్థులకు ఓపెన్ మెరిట్ కింద కేటాయిస్తారు. ఇందులో పదో తరగతిలో వచ్చిన మార్కులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుంది. అలాగే ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు 100 సీట్లు కేటాయిస్తారు. ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు 25 శాతం సూపర్ న్యూమరీ సీట్లు అందుబాటులో ఉంటాయి.

ఇసుక అవినీతి రూ.50 వేల కోట్లు

ఉచిత ఇసుక అభినందనీయం - మాజీ ఎమ్మెల్యే బాధితులు నా వద్దకు రండి : ఎమ్మెల్యే బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్ అండ్ కో ఇసుక మాఫియా ద్వారా రూ.50 వేల కోట్ల అవినీతికి పాల్పడిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. ఇసుకను బొక్కి జగన్, పెద్దిరెడ్డి ఖజానాలను నింపిన జేపీ కంపెనీ పై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పట్టణం లోని ఎన్టీఆర్ భవన్ లో మంగళవారవ ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ తీసుకొచ్చిన ఇసుక పాలసీ కారణంగా భవన నిర్మాణరంగం పూర్తిగా కుదేలైందన్నారు. ఆ రంగాన్ని నమ్ముకున్న కార్మికులు కడుపు మాడ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వీటన్నిటికీ చెక్ పెడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఉచిత ఇసుక పాలసీ పేద వర్గాలకు ప్రయోజనం చేకూరుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. తద్వా రా భవన నిర్మాణ రంగం పుంజుకుని కార్మికులు మూడు పూట్ల తిండి తినగలుగుతారని ఆయన అభిప్రా యపడ్డారు. ఇకపై నియోజకవర్గంలో ఉచిత ఇసుక పాలసీ అమలయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అందుకు తగ్గట్లుగా పారదర్శక ఇసుక విధానాన్ని అమలుపరిచేలా మైనింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. పట్టణంలోని సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిని తక్షణ కర్తవ్యంగా చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా బీసీ హాస్టల్ ను నెల రోజుల్లో పై అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా కాసా గార్డెన్ రెసిడెన్షియల్ స్కూలుకు కజారియా పరిశ్రమ సహకారంతో ఒక బ్లాక్ ను నిర్మించి వినియోగంలోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఇకపై సోమవారం నుంచి శుక్రవారం వరకు స్థానిక పంచాయతీరాజ్ అతిధి గృహంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని... ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నేరుగా కలవచ్చని తెలిపారు. ప్రజలు ఇచ్చే అర్జీల కోసం ఓ సాఫ్ట్ వేర్ ను అందుబాటులో ఉంచుతున్నా మని... ఓటీపీ సాయంతో సమస్య 48 గంటల్లోగా పరిష్కారం అయ్యేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మండలా నికి ఓ టీడీపీ కార్యాలయం ఉంటుందనీ, అక్కడ ఒక పీఏ ను ఉంచి సమస్యలు తెలుసుకుంటామని అన్నారు. మాజీ ఎమ్మె ల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి భూ బాధితులకు మూడు రోజుల సమయం ఇస్తున్నాననీ, వారందరూ వచ్చి నన్ను నేరుగా కలిస్తే వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆలయంలో ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నా మనీ, అన్ని శాఖలతో సమీక్షలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో రౌడీయిజం లేకుండా చేయడం కర్తవ్యం గా పెట్టుకున్నా నన్నారు. పోలీసులు రౌడీ మూకల వెంట పడతారనీ, పోలీసులు కూడా పట్టించుకోకపోతే తానే స్వయంగా రంగంలో దిగుతానని హెచ్చరించారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కు శాశ్వత భవనం నిర్మాణం కోసం త్వరలో స్థలాన్ని కేటాయిస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు రావిళ్ల ముని రాజా నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ధరలపై జనుము, జీలుగ విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర- సత్యవేడు: సబ్సిడీ ధరలపై జనుము,జీలగ విత్తనాల ను స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పలువురు రైతులకు పంపిణీ చేశారు.మంగళవారం సత్యవేడు మండల పరిషత్ కార్యా లయ ప్రాంగణం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం జనుము,జీలగ విత్తనాల బ్యాగులను రైతులకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు అవసరమైన విత్తనాలను,ఎరువులను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ఇప్పటికే పంట పెట్టుబడును గాను రైతులకు ప్రతి ఏడాది 20 వేల రూపాయలను అందించాలన్న ఎన్నికల హామీ త్వరలో అమలు చేయడానికి కసరత్తు జరుగుతుందన్నారు.తద్వారా ఏ రైతు కూడా పంట సాగులో నష్టపోకూడదు అన్నదే ప్రభుత్వ ఆశయం అన్నారు.వ్యవసాయ శాఖ ఏవో మురళి సబ్సిడీ పోను జనుము 10 కేజీల బ్యాగు 440 రైతులు చెల్లించాల్సిందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పరమశివం (భాపు),మురళి (కోళ్ల చిన్న) నారాయణ,తులసి జనసేన బాలమురళీకృష్ణ,వ్యవసాయ శాఖ ఏడి సుబ్రహ్మణ్యం,ఎంపీడీవో చంద్రశేఖర్,గ్రామీణ వ్యవసాయ అసిస్టెంట్లు స్వర్ణలత,పూర్ణచంద్ర, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం అభివృద్ధి నా బాధ్యత : నేలవల విజయశ్రీ

విశాలాంధ్ర - పెళ్లకూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు మంగళ వారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన పెళ్లకూరు మండలంలో విజయోత్సవ అభినంద సభను ఏర్పాటు చేయడం జరి గింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండ లంలో ప్రతి గ్రామపంచాయతీ నుండి పెద్ద సంఖ్యలో మండల నాయకులు, సీని యర్ నాయకులు ఎమ్మెల్యే విజయశ్రీ శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానిం చడం జరిగినది. ఈ సందర్భంగా విజయ శ్రీ మాట్లాడు చూ పెళ్లకూరు మండల ంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలా సన్మానించడం చాలా ఆనందంగా ఉందని గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఈ మండలంలో వెనకబడి ఉందని అలాంటి పరిస్థితిని అధిగమించి ప్రతి ఒక్క కార్యకర్త తన సొంత బాధ్యతగా తీసుకొని నాకు మెజారిటీని తెచ్చి పెట్టి గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసి ఆయన మాటను నిలబెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు దక్కుతుందని, వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని అదేవిధంగా మండల అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసి వాళ్ల సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటా నని ఆమె తెలియజేశారు, అనంతరం మండల స్థాయి అన్ని శాఖల సమీక్ష కార్యక్ర మం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో దేవ రెడ్డి నాగేందర్ రెడ్డి,ఎంపీపీ శేఖర్ రెడ్డి ,జెడ్పిటిసి నన్నుం ప్రిస్కిల్లా, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ఏలూరు మురళీకృష్ణారెడ్డి,పేరం రమేష్ నాయుడు, మధు నాయుడు, చైతన్య కృష్ణారెడ్డి, దార్ల రాజేంద్ర, ప్రసాద్ నాయుడు, నూతలపాటి ప్రసాద్ నాయుడు, శేఖర్ నాయుడు,కేవీ నాయుడు,సీనియర్ నాయ కులు, సర్పంచులు, ఎంపీటీసీలు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు వరం.. ఉచిత ఇసుక విధానం..!

విశాలాంధ్ర -పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలం అడవి కొడింబేడులో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నిల్వలో ఉన్న ఇసుకను మంగళవారం పిచ్చాటూరు తహసి ల్దారు హుస్సేన్ సాహెబ్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా తహసిల్దారు హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఆదేశాల మేరకు నూతన ఇసుక విధానం 2024 ద్వారా పేదలు, మధ్యతర గతి కుటుం బాలు,సంపన్నులు ఇళ్లు కట్టుకోవడానికి ఇసుక టన్ను 200 రూపాయలకే విని యోగదారులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నా రు.వ్యక్తి గతంగా ఒక వ్యక్తికి రోజుకు 20 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే సరఫరా చేయాలన్నారు. ఇసుక స్టాక్ వివరాలు గనుల శాఖ ఆన్లైన్ వెబ్సైట్ నందు చూసి నిర్ధారించుకున్న తర్వాత సదరు వినియోగదారుడు వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, స్టాక్ పాయింట్ నుండి తీసుకెళ్లాల్సి ఉంటుందని, ఇసుక నిల్వ కేంద్రాల వద్ద నామమాత్రపు రుసుం వివరాలను తప్పనిసరిగా ప్రజలకు తెలపాలని, రుసుము డిజిటల్ పద్ధతిలో చెల్లిం చాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 6గం. నుండి సాయంత్రం 6 గం.ల వరకు ఇసుక అందుబాటులో ఉంటుందని తెలిపారు. తదనుగుణంగా రసీదు, పర్మిట్ ఇవ్వడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సిసికెమెరాలతో నిఘా ఏర్పాటుచేయాలని, పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ, పోలీస్ తదితర అధికారులు పర్యవేక్షణ ఉండాలని, అనధికారికంగా ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు వారు ఇసుక తీసుకున్న అవసరాలకు మాత్రమే వినియోగించాలని, ఎవరైనా స్టాక్ నిల్వచేసి తిరిగి అమ్మడం, అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల నాయ కులు, కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

విశాలాంధ్ర - సత్యవేడు: ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే నియోజకవర్గ ప్రజలు రెండోసారి తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చెప్పారు.మంగళవారం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం,జడ్పిటిసి విజయలక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం సభను ఉద్దేశించి మాట్లాడుతూ నియోజవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయం అన్నారు.ఇందులో భాగంగానే గత 14 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పనిచేసినట్టు ఆయన పేర్కొన్నారు.దీన్ని గుర్తించడం వల్లే మళ్లీ సత్యవేడు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలోనూ తాగునీరు, రోడ్లు,విద్యుత్తు అవసరాలు కీలకంగా మారిందన్నారు.వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి పనిచేస్తే ప్రభుత్వాన్ని కూడా మంచి పేరు వస్తుందన్నారు.అలాగే తాను ఇటీవల చిన్న పాండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు 14 మంది సిబ్బంది ఉన్న కనీసం ఒకరు కూడా లేదన్నారు.దీనిపై సంబంధిత మెడికల్ డాక్టర్ అనితను ప్రశ్నించారు.కొందరు డిఈ స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడం పట్ల ఎమ్మెల్యే ఆదిమూలం అసంతృప్తి వ్యక్తం చేశారు.దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్ పంపాలని ఎంపీడీవో చంద్రశేఖర్కు సూచించారు. తదనంతరం శాఖల వారిగా చర్చ సాగింది.ఈ నేపథ్యంలో జరిగిన వ్యవసాయ శాఖ చర్చలో ఏవో మురళి మాట్లాడుతూ ఉచిత భూసార పరీక్ష కార్యక్రమంలో 540 మట్టి నమూనాలను సేకరించామన్నారు.పశుసంవర్ధక శాఖ చర్చలో డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ 75 శాతం సబ్సిడీతో మొక్కజొన్న విత్తనాలను పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్టు సభ దృష్టికి తెచ్చారు.తమ గ్రామంలో 30 ఏళ్ల క్రిందట ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు తీగలు తుప్పు పట్టి పాడవడంతో తెగిపోయే పరిస్థితి వచ్చిందని,దీన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని జడేరి సర్పంచ్ బాబు సభ దృష్టికి తెచ్చారు. తమ గ్రామం మీదుగా పోతున్న ఆర్అండ్బి రోడ్డు ధ్వం సం కావడంతో గ్రామం లోపల వాహనాలు రావడంతో చిన్నపి ల్లలు ప్రమాద బారిన పడుతున్నట్టు సర్పంచు శిరీష శ్రీనివాసరెడ్డి విన్నవించారు.ఈ నేపథ్యంలో తమ గ్రామం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు స్థానంలో సిమెంటు రోడ్డు మంజూరు చేయడంతో పాటు 10 మురుగు కాలవ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల న్నారు. కాగా ఎమ్మెల్యే ఆదిమూలం సభ నుంచి లేచి వెళ్లిపోవ డంతో కొన్ని శాఖల చర్చ జరగకనే సభను అర్ధాంతరంగా ముగిం చారు. ఈ సమావేశంలో తహసిల్దార్ రామాంజనేయులు,గంగ డిఈ ఓబుల్ దాస్,వ్యవసాయ ఏడి సుబ్రహ్మణ్యం, ట్రాన్స్కో ఏడి చంద్ర నాయక్,చెరివి ఏఈ జగదీష్, హౌసింగ్ ఏఈ సుబ్ర మణ్యం, ఎంఈఓ రవి,ఉపాధి ఏపీవో కిష్టయ్య,ఐసిడిఎస్ దేవ కుమారి, వెలుగు ఏపిఎం స్వర్ణలత,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారా యణ, దాసుకుప్పం పిహెచ్సి వైద్యులు డాక్టర్ గుణశేఖర్, మురళీ కృష్ణ, కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సతీష్, ఏఎస్డబ్ల్యూఓ కృష్ణ,హాస్టల్ వార్డెన్స్ గంగాధరం, విజయకు మారి, సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్,పంచాయతీ సర్పంచులు మంజుల రమేష్,రవి రెడ్డి,మునస్వామి, శివరంజని పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - పాకాల : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి మంగళవారం పాకాల మండలంలోని దివ్యాంగులు పాలాభిషేకం నిర్వహించారు స్థానిక పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మొట్టమొదట ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వహించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 3000 ఉన్న పెన్షన్ ని 6000 చేసినందుకు పాకాల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు . ఎన్నికల కు ముందు చెప్పిన మాట ప్రకారం పెన్షన్ పెంచినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాకాల మండలం దివ్యాంగుల సంఘము నాయకులు మోహన్ బాబు.టీ, యస్.జ్యోతి, ఈశ్వరబాబు, యన్.నరసింహ రెడ్డి, లలిత, మునేంద్ర బాబు, షోకత్ , టీ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకపోతే చర్యలు తప్పవు : డిఎల్‌పివో

- కంట్రోల్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తున్న అధికారులు
- రెండు రోజులల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- పంచాయితీ కార్యదర్శిలకు మోమోలు జారి చేసిన డిఎల్‌పివో

విశాలాంధ్ర - దొరవారిసత్రం : పగలే వెన్నెల వీధులో ఆగని వీధి లైట్లు అనే వార్త సోమవారం విశాలాంధ్ర జాతీ య దినపత్రికలో ప్రచురిత అయిన విషయం తెలిసిందే.ఈ వార్తకు సంబందించిన సూళు ్లరుపేట డిఎల్‌పివో రవీం ద్రబాబు స్పందించారు. దొరవారిసత్రం మండల పరిధి లోని అక్కరపాక,పోలిరెడ్డి పాళ్లెం,తనయాలి ,మోదుగులపాళ్లెం గ్రామాలను తనిఖీ చేశారు.అనంతరం డిఎల్‌పివో రవీం ద్రబాబు మాట్లాడుతూ గ్రామాల్లో నిరంతరం వెలుగుతున్న విధ్యుత్ దీపాలను వెంటనే కంట్రోల్ ఏర్పాటు చేసి విద్యుత్ పోదుపు చేయాలన్నారు.గ్రామాలోని వీధులలో అక్కడ అక్కడ ప్లాస్టిక్ పేపర్లతో కూడిన చెత్త చెదరాలు ఉన్నాయని వెంటనే తోలగించండి అంటు పంచాయితీ కార్యదర్శిలపై మండి పడ్డారు.పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మునికష్టయ్యకు విధులు అలసత్వం చేసినందకు వారికి మోమాలను జారీ చేశారు.రెండు రోజులలో పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు అన్ని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం

: ఎమ్మెల్యే విజయ శ్రీ

విశాలాంధ్ర - దొరవారిసత్రం : అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టా వేశామని సూళ్లురుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ అన్నారు.మంగళవారం దొరవారిసత్రం మండల పరిధిలోని నేతాజి నగర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ యార్డులో ఉన్న ఇసుకను ప్రభుత్వ నిభందనాలు ప్రకారం అందిచటకు శ్రీకారం చుట్టారు.ఈ సంద ర్భంగా గత ప్రభుత్వంలో అక్రమంగా డంపింగ్ యార్డులు నుండి జిల్లాలు దాటి రాష్ట్రాలు వెళ్లిపోయేవి.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మెరకు పేద వారికి ఇసుకను అందాచాలనే లక్ష్యంతో టన్నుకు 465 చోప్పన రోజుకు ఓక్కోరకి 20 టన్నులు మాత్రమే ఇచ్చే విధంగా ఆదేశాలు జారి చేశారన్నారు.ఈ డంపింగ్ యార్డ్‌లలో 21465 టన్నుల ఇసుక ఉంది.ఈ ఇసుక సూళ్లురుపేట నియోజక వర్గంలో తప్పా మిగితా ప్రాంతాలకు వెళ్లకుండా గట్టి బందోబస్తు చేశామన్నారు.రెవెన్యూ,సెబ్,మైనింగ్,పోలీసు అధికారులు ఇసుక రవాణాను పరివేక్షింస్తారు.అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ, సూళ్లురుపేట ఆర్‌డివో చంద్రముని ఇసుకను విటాచ్ సహాయంతో ట్రాక్టర్‌లో నింపి ఇసుక అమ్మకాలకు జెండా ఊపారు.వీరితోపాటు టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు,టిడిపి నాయకులు నాగేంద్రనాయుడు ,మనోహర్ రెడ్డి,సంచి విజయ్‌కుమార్,బందిలి ఉదయ్‌కుమార్,సెబ్ సిఐ సోమయ్య,నాయుడుపేట రూరల్ సిఐ జగన్‌మోహన్ రావు,ఎంపిడీవో శివరాజు,తహశీల్దారు ప్రసాద్,ఎస్ఐతిరుమల రావు,రెవెన్యూ,మైనింగ్ అధికారులు ఉన్నారు.

ఆర్టీసీ యూనియన్ గౌరవ అధ్యక్షులకు ఘనసన్మానం

విశాలాంధ్ర - పుంగనూరు: ఆర్టీసీ మద్దూర్ యూనియన్ స్టేట్ గౌరవ అధ్యక్షులుగా ఆర్వీటి బాబు నియమింప బడడంతో ఆర్టీసీ యూనియన్ నాయకులు మంగళవారం రోజున ఆయన కు పూల హారం వేసి చాలవా కప్పి ఘన ఒగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఆర్వీటి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడపడం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తాన న్నారు. నాపై గౌరవంతో ఈ పదవి ఇచ్చిన ఆర్టీసీ యూనియన్ నాయకులకు రుణపడి ఉంటాను అన్నారు యూనియన్ నాయకుల్ని తన సొంత సోదరులగా భావించి వారి కష్ట సుఖాలను పాలుపంచుకొని వారికి అండగా నిలబడడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆర్టిసి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ఏర్పాటు

విశాలాంధ్ర-తిరుపతి : తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలం కడూరు క్రాస్ వద్ద ఏఐటీయూసీ కి అనుబంధంగా కడూరు క్రాస్ వద్ద అంబేద్కర్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గం గౌరవఅధ్యక్షులు అంబాకం చిన్ని రాజు మాట్లాడుతూ లైఫ్ టాక్స్ రోడ్ టాక్స్ ప్రభుత్వ ఆటో డ్రైవర్లను దోసుకుంటా ఉందని ఒకపక్క డీజిల్ పెట్రోల్ రేట్లు విపరీతంగా పెంచి ఆటోలను నడపలేని స్థితి ఉందని. ఆటో డ్రైవర్లు అంటే నలుసుగా చూసే పద్ధతి పోవాలని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇచ్చి వారి సంక్షేమం కోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించాలని చిన్ని రాజు డిమాండ్ చేశారు ఆటో డ్రైవర్లు రోజంతా కష్టపడిన వస్తున్న ఆదాయముతో పిల్లల చదువు వైద్యం కుటుంబ గడవడమే కష్టమవుతున్నదని అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు చంద్ర ఏఐ వైఎఫ్ నియోజకవర్గ నాయకులు మురళి. ఆటో యూనియన్ నాయకులు జయరామయ్య మునిరాజ్.వెంకట్ రమణయ్య మురళి. వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర - పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలంలోని ఎరువులు, పురుగుమందులు మరియు విత్తనం దుకాణాలపై వ్యవసాయ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తిరుపతి జిల్లాకు చెందిన .ఎల్లప్ప డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అనంతపూర్, డి. జీవానందం విజిలెన్స్ ఎస్సై రాజ మండ్రి ,తిరుపతి జిల్లా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జి.ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ముందుగా షాపులోని ఎరువులు, పురుగు మందులు ధరల పట్టికను, రిజిస్టర్లను బిల్లు పుస్తకాలు, లైసెన్స్, ఇన్వాయిస్ మొదలైన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గోదాం లో ఉన్న ఎరువు నిల్వలను తనిఖీ చేశారు.కాలం చెల్లిన మందులను అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోని నెమలమిట్ట అగ్రహారం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు చోటుచేసుకున్నాయి.పోలీసులు వివరాలు మెరకు నాయుడుపేట నుండి సూళ్లురుపేట వైపు స్కూటీలో జోన్నదుల సాయి పద్మ వెళ్తుతుండగా అగ్రహారం సమీపంలో స్కూటీ అదుపు తప్పి జాతీయ రహదారి వెంబండి ఉన్న చెట్ల పోదలలో పడిపోయింది.స్కూటీలో నుంచి క్రిందకు పడిపోవడంతో సాయి పద్మకు తీవ్రగాయాలు తగిలాయి.అనంతరం అమెను సూళు రుపేట టోల్‌ప్లాజా వారి అంబులేన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ ఆసుప్రతికి చికిత్స నిమిత్తం తరలించారు .గాయపడిన సాయి పద్మ గుంటురూ జిల్లా మంగళగిరి గ్రామం.ఈమే జాబ్ నిమిత్తం ఇంటి నుండి బయటకి వచ్చిన్నట్లు సమాచారం.ఈ ప్రమాద సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమం కోసమే ఇసుక ఉచిత పాలసీ

ఇసుకను వైసిపి ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకుంది : చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

విశాలాంధ్ర -చిత్తూరు: ప్రజా సంక్షే మం కోసమే రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇసుకను ఉచితం చేశారని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు చెప్పారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఎమ్మెల్యేలు ఎంపీలు ఇసుకనే ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకుని సుమారు 50 వేల కోట్ల వరకు దోచుకుని పంచుకున్నారని ఆరోపించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచి తంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన ంగా ఇసుకను ఉచిత ము చేస్తే నిర్మాణరంగం వేగవంతం కావ డంతో పాటు పేదల సొంత ఇంటి కల నెరవేరి అనేక మందికి ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉందన్న ముందుచూపుతో చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయానికి వచ్చారన్నారు. భవన నిర్మాణ రంగం ఊపొందుకుంటే పలు రకాలుగా అనేకమందికి పలు రకాలుగా ఆదాయం మార్గాలు మెరుగుపడతాయన్నారు.. గత ప్రభుత్వ విధానంతోణ రాష్ట్రంలో భవననిర్మాణ రంగం చితికిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం రవాణా చార్జీలు చెల్లించి ప్రస్తుతము ఇసుకను తీసుకు వెళ్ళవచ్చునని తెలిపారు. వైసీపీ నేతలు దీన్ని జీర్ణించుకోలేక ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కొత్త ఇసుక పాలసీలో అక్రమాల కు అవకాశాలు లేకుండా విజిలెన్స్ కమిటీలు పర్యవేక్షణతో పాటు జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్య ంలో ప్రత్యేక కమిటీ నిత్యం పరిశీలిస్తుందన్నారు. ఈ కొత్త ఇసుక పాలసీనీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ ఈ విలేక రుల సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, చిత్తూ రు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాజీ ఎమ్మెల్యే గాంధీ టిడిపి నేతలు కోదండ యాదవ్, సురేంద్ర కుమార్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై అధ్యాపకులకు ఆన్‌లైన్ శిక్షణ

విశాలాంధ్ర - చంద్రగిరి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు మోహన్ బాబు విశ్వ విద్యాలయం, తిరుపతి సంయుక్తంగా సోమవారం ఆన్లైన్ మోడ్ లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ పై ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భం గా నైపుణ్యా భివృద్ధి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) డా. రవి గుజ్జుల మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ విశిష్టతను, అమెజాన్ వెబ్ సర్వీసెస్ వివిధ అంశాలు మరియు వాటి ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది. ఈ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను క్లౌడ్ కంప్యూటింగ్ మీధ పొందుపరిచామని పేర్కొన్నారు. ఈ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా అధ్యాపకులు సాంప్రధాయ డేటా నిల్వల పద్ధతుల వలన నష్టాలు, అమెజాన్ వెబ్ సర్వీసెస్లో యస్3 బకెట్ లో డేటా నిల్వ చెయ్యడం, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రయోగశాల కన్సోల్ లను ఉపయోగించడం వలన విద్యార్థులు నూతన సమాజంలో సరికొత్త ఉపాధి నైపుణ్యాలు పెంచుకుని, బహుళ జాతీయ సంస్థలలో ఉద్యోగాలు, ఎక్కువ జీతభత్యాలను పొందడం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా చీలిరామకృష్ణ, గోపిరాజు వ్యవహరించారు. ఈ ఆన్లైన్ శిక్షణలో వివిధ కళాశాలల నుండి 150 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనకు విశేష స్పందన

విశాలాంధ్ర - చంద్రగిరి: కొటాల ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్. ప్రియాంక ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఐతేపల్లి ఎంపిపి ఎస్ లో గ్రామ ప్రజలకు క్యాన్సర్ చెందిన బ్రేస్ట్, ఓరల్, సరవైకల్ క్యాన్సర్ టెస్ట్ చేయడం జరిగి నది. క్యాన్సర్ మీద గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగి నది. ఈ కార్యక్రమం లో మునికుమారి, ధనలక్ష్మి, లలిత, ఎంపిహె చ్ఎస్, ఎంఎల్ హెచ్ పి ఎస్, ఎంఎన్ఎస్, అంశాలు104 సిబ్బంది, స్విమ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొని విజయవంతం చేసినారు.

జె.వి.వి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా బాలింతలు గర్భిణీలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజే శారు . వైద్య పరీక్షలకు వచ్చిన బాలింతలు, గర్భిణీలకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారం పంపిణీ కార్యక్ర మం నిర్వహించారు . ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక గూడూరు శాఖ జె.వి.వి అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తాము ఈ కార్యక్రమం 9 సంవత్సరాలుగా నిర్వ హిస్తున్నామని ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తి కలిగిస్తు ందని ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవా దాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వైద్య సిబ్బంది, గర్భిణీలు , బాలింతలు పాల్గొన్నారు .

వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలోని త్యాగ రాజ వీధిలో ఉన్న శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు . భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసా దాలు స్వీకరించారు . ఉభయ దాతలుగా నీలి శెట్టి సత్యవతి కుమారులు ఉమాశంకర్ , రామకృష్ణ ,వ్యవహ రించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలం కారూరు సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు కారణంగా అప్పల రాజు కండ్రిగ గ్రామ పరిధిలో నేడు (బుధవారం) విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలుగుతుందని పిచ్చాటూరు మండలం విద్యుత్ శాఖ ఏఈ రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ మరమ్మతు పనులు కారణంగా ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, రైతులు, గ్రామ ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

విశాలాంధ్ర-వెంకటగిరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి నెల రోజులు కాకముందే ఉచిత ఇసుక పాలసీని తీసుకురావడం అభినందనీయమని వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని, ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యుల భారీ ఊరట లభించిందన్నారు. ఫ్రీ శాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం జరిగిందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తెలుగుదేశం విధానమన్నారు. ప్రతి పేదవాడు ఇల్లు కట్టుకునేలా ఈ ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వెంకటగిరి పట్టణ మరియు రూరల్ తెలుగుదేశం నాయకులు, అనుబంధ కమిటీ సభ్యులు, ఐటీడీపి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి మంగళవారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు రేణిగుంట విమానాశ్రయం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన తరు వాత అమరావతి నుంచి హైదరాబాదు వెళ్లారు. అక్కడ నుంచి తన వ్యక్తిగత పనులపై అమెరికా వెళ్లారు. అమెరికా పర్యటన ముగించుకుని శ్రీకాళహస్తికి విచ్చేసిన సందర్భంగా శ్రీకాళ హస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల నుంచి వందలాది మంది టీడీపీ శ్రేణులు, ఆయన అభిమానులు రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లి పుష్పగుచ్చాలు అంద జేసి స్వాగతం పలికారు. అక్కడ నుంచి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి భారీ వాహన శ్రేణితో ఊరందూరుకు చేరుకున్నారు.

దీర్ఘ కాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దీర్ఘకాలిక వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తం గా ఉండాలని స్టెప్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్టు మేనేజరు రమేష్ చెప్పా రు. శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు సమీపంలో మంగళవారం స్టెప్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యం లో కారు డ్రైవర్లకు దీర్ఘ కాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో అసురక్షిత లైంగిక పద్ధతులు పాటించడం, నిర్ధారణ పరీక్ష చేయని రక్త మార్పిడి... కలుషిత సూదులు, సిరంజులు, టాటూలు ద్వారా ఎయిడ్స్ సోకిన తల్లి నుంచి బిడ్డకు ఎయిడ్స్ వ్యాధి సోకుతుందన్నారు. అసాధారణంగా బరువు తగ్గిపోవడం, తేలిక పాటు పనులకుకూడా నిస్సత్తువ కావడం, తరచూ జ్వరం రావడం, మలవిసర్జన ఎక్కువసార్లు జరగడం లాంటి లక్షణాలు కలిగినప్పుడు ఎయిడ్స్ వ్యాధిగా అనుమానించి నిర్ధారణ పరీక్షలు దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలలో చేయించుకోవాలని ఆయన సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల, వారి కుటుంబంపట్ల ఎటువంటి వివక్ష చూపరాదన్నారు. అదేవిధంగా ధూమపానం, మద్య పానం, గుట్కా, పాన్ పరాగ్, గంజాయి లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నా రు. ఈ కార్యక్రమంలో కారు డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు బషీర్, డ్రైవర్లు రాజు, మస్తాన్, రసూల్, ముని సంస్థ సిబ్బంది గాయత్రి, సురేష్, రోజా, రాధ పాల్గొన్నారు.

'సమస్య మీది పరిష్కారం మాది' కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ విఎం థామస్ బుధవారం ఉదయం 10 గంటలకి ఎంపిడిఓ కార్యాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షులు చెంగ్రాల యాదవ్, జిల్లా రైతు సంఘ అధ్యక్షులు నాగేశ్వర రాజు, బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికులు నిర్వహించే సమస్య మీది పరిష్కారం మాది కార్యక్రమాన్ని టిడిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇందుకోసం సమావేశం నిర్వహిస్తుంది. దీనికి సంబంధించిన విషయాలను ఎంపీడీవో శ్రీధర్ నాయుడు ని అడిగి తెలుసుకున్నారు. టిడిపి మండల పార్టీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చెంగల్ రాయులు, చిరంజీవి, మండల యువత అధ్యక్షులు మురళి, రాము, ఆ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ

విశాలాంధ్ర-నాయుడుపేట రూరల్: తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డా. ఎస్.వెంకటేశ్వర్‌ను సూళ్లూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, దొరవారి సత్రం మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, టిడిపి నాయకులు నెలవల రాజేష్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో

ఆటో యూనియన్ ఏర్పాటు

విశాలాంధ్ర - వరదయ్యపాలెం: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలం కడూరు క్రాస్ వద్ద ఏఐటీయూసీకి అనుబంధంగా కడూరు క్రాస్ వద్ద అంబేద్కర్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గం గౌరవఅధ్యక్షులు అంబాకం చిన్ని రాజు మాట్లాడుతూ లైఫ్ టాక్స్ రోడ్ టాక్స్ ప్రభుత్వ ఆటో డ్రైవర్లను దోసుకుంటా ఉందని ఒకపక్క డీజిల్ పెట్రోల్ రేట్లు విపరీతంగా పెంచి ఆటోలను నడపలేని స్థితి ఉందని. ఆటో డ్రైవర్లు అంటే నలుసుగా చూసే పద్ధతి పోవాలని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇచ్చి వారి సంక్షేమం కోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించాలని చిన్ని రాజు డిమాండ్ చేశారు ఆటో డ్రైవర్లు రోజంతా కష్టపడిన వస్తున్న ఆదాయముతో పిల్లల చదువు వైద్యం కుటుంబ గడవడమే కష్టమవుతున్నదని అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు చంద్ర ఏఐ వైఎఫ్ నియోజకవర్గ నాయకులు మురళి. ఆటో యూనియన్ నాయకులు జయరామయ్య మునిరాజ్.వెంకట్ రమణయ్య మురళి. వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై తనిఖీలు చేపట్టడండి

కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి : ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, సెబ్ అధికారులు మద్యం అక్రమ నిల్వలు, కల్తీ మద్యం, సారా విక్రయం జరగకుండా నివారణ, నియంత్రణ చర్యలు చేపడుతూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితిలోనూ ఉల్లంఘనలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, సెబ్ అధికారులతో కలెక్టర్ మద్యం అమ్మకాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ మద్యం అక్రమ నిల్వలు, అక్రమ సారా అమ్మకాలపై దృష్టి పెట్టి నివారణ, నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారి జానకి రామ్ వివరిస్తూ జిల్లాలోని తిరుపతి, ఓజిలి డిపోల నుండి 24 వాహనాల ద్వారా రవాణా చేస్తున్నామని వాటికి జిపిఎస్ ఏర్పాటు ఉన్నాయని, 240 ప్రభుత్వ మద్యం దుకాణాలకు, లైసెన్స్ పొందిన బార్లకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మిథనాల్ యూనిట్లు 32 ఉన్నాయని తెలుపగా వాటిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గాజుల మాండ్యం వద్ద గల ఎస్వీఆర్ డిస్టిలరీ వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారి రాజేంద్ర వివరిస్తూ 2023 సం.కు గానూ 102, 2024 సం. కు గాను జూలై 8వ తేదీ వరకు 950 కేసులు వెరసి మొత్తం 1,052 డిపీఎల్ కింద బుక్ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమం కొనసాగిస్తు న్నామని తెలిపారు.

యోగులపర్వతంలో మొక్కలు నాటిన పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: మండలం పరిధిలోని యోగులపర్వతంలో తన మాతృ మూర్తి విజయమ్మ పేరిట మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సంద ర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట మొక్కలునాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తల్లిని పూజించినట్లే మొక్కను కూడా పూజించా లని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నా రు. వాతావరణంలో వస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకొని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం వహించాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, హరి మరియు గణేష్ పాల్గొని మొక్కలు నాటారు.

సుప్రీం కోర్టు త్వరలో ప్రత్యేక లోక్ అదాలత్: నీరబ్ కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర-తిరుపతి: సుప్రీం కోర్టు త్వరలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో పలు శాఖలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న పలు కేసులకు సంబంధించి ఆం.ప్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో మంగళవారం సాయంత్రం విజయవాడ నుండి ముందస్తుగా సమీక్షించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ హాజరయ్యారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం చియ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఇందులో భాగంగా పిల్లలకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు అందించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రిషితారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గాలి మురళినాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చింతపట్ల భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ రామయ్య, మాజీ పాల సొసైటీ ఛైర్మన్ రావిళ్ళ మునిరాజా నాయుడు, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, ఎస్సీ సెల్ నాయకులు సాలి రాజా, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య, జనసేన పార్టీ అధ్యక్షులు విజయ్ భాస్కర్, శంకరయ్య, వెంకటేష్, నరసింహులు, బాలాజీ, దామోదరం, వేమలయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలి: అమరనాథరెడ్డి

విశాలాంధ్ర - పెద్దపంజాణి : నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సూచించారు పెద్దపంజాణి మండలంలోని గోనమాకుల పల్లిలో మంగళవారం ఆయన పలు పంచాయతీలకు చెందిన ముఖ్య నేతలతో ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్ని పథకాలు లబ్ధిదారులకు చేరువ కావాలన్నారు. ప్రజలకు సేవ చేయడాన్ని నాయకులు బాధ్యతగా భావించి పని చేయాలన్నారు. పంచాయతీల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసుకుందామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని అందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం లోని గ్రామదేవత శ్రీ బంగారమ్మ ఆలయములో మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి అమ్మవారికి పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే.ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలి యార్, కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

వినరా.. వినరా.. విడ్డూరం...

- ప్రజాప్రతినిధి ఘనకార్యం
- పార్టీ తీర్థం పుచ్చుకున్న వారికి ప్రభుత్వ ఆస్తులు సమర్పయామి..
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆయన ప్రజలచే ఎన్నుకో బడిన వ్యక్తి.. ప్రజల ఆస్తులకు సంరక్షించాల్సిన బాధ్యత కలిగిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కానీ అధికారంలోకి రాగానే అవన్నీ ఆయన గారు మర్చిపోయారు.. అవకాశం వచ్చిందే తడవు అన్నట్లు ఐదేళ్లలో ఏం ఉద్దేశ్యాలో అన్ని చేసేసి అయిన కాడికి సర్దుకున్నాడు.. ప్రజా ఆస్తులకు పెద్దమనిషిగా ఉండి వాటిని పరిరక్షించాల్సిన ఆయనే బాధ్యత మర్చి వాటి భక్షణకు సహక రించాడు. ఆలయ, మున్సిపల్ స్థలాలు ఒకటేంటీ పప్పు బెల్లంలా తన వద్ద చేరిన వారికి, కొత్తగా పార్టీ తీర్థం పుచ్చుకుంటామని వచ్చేవారికి పంచిపె ట్టేశారు.. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని అధికారులు వెళ్లితే మనోడే వదిలేయండంటూ వారికి హెచ్చరికలు చేశాడు.. కాదు గీదు అంటే వారిని భయభ్రాంతులకు గురిచేశాడు.. ఇంకేం స్థలాలు పొందిన అనుచరులు దర్జాగా నిర్మాణాలు చేపట్టేశారు. వెంటనే నాయకుని ఆదేశాల్లో భాగంగా వారికి సంవత్సరాల పాటు లీజులకిచ్చేలా రికార్డులును సైతం అధికారుల వద్దే తయారు చేయించేశారు.. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో అదీ దేవాలయ భూముల్లో ఎవరూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు.. అలా నిర్మాణాలు చేపడితే అది ఎంతో పెద్ద తప్పు, తిరిగి ఆ నిర్మాణాలు చేపట్టిన వారికే వాటిని లీజుకు ఇవ్వడం ఇంకా పెద్ద తప్పు.. ఆయన చెప్పారు.. మేం ఇచ్చాం.. కోట్లాది రూపాయిల విలువ చేసే స్థలంలో ఏ లెక్కన అధికారులు వారికి ఇచ్చారంటే ఇదీ అధికారుల చెప్పే సమాధానం... ఐదేళ్లలో ఇలా విలువైన స్థలాలన్నో దారదాత్తం అయిపోయినా ఒక్కరంటే ఒక్కరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదేం దోపిడీ.. ఇదేం పద్దతి అని ఎవరైనా ప్రశ్నిస్తే ఆ గొంతు ఇక వినిపించకుండా చేయడం సదరు నాయకుడి వెన్నతో పెట్టిన విద్య. ఆయన నోటికి భయపడి కనీసం ప్రతిపక్షాలు కూడా ఇదేమంటూ ప్రశ్నించలేని పరిస్థితి. ఎన్నికల్లో ఆ పార్టీ అడ్రస్ లేకుండా పోవడంతో లోలోపల జరిగిన దందాలు అక్రమాలు, భూ కబ్జాలు, ఆక్రమణలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి.. తమ బండారం బయటపడుతుండటంతో నాయకులు అనుచరులు, అధికారుల వద్దకు వెళ్లి సమాచారం బయటకు వెళ్లకుండా చూడాలంటూ కాళ్ల వేళ్లపడి కోరుతున్నారు. మరో పక్క అధికారులు కూడా ఎక్కడ ఈ 'గలీజు' బాగోతాలు తమ మెడకు చుట్టుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ఎన్నో విలువైన స్థలాలున్నాయి. అయితే వీటి పర్యవేక్షణ లేకపోవడం, పలువురు కళ్లు వీటిపైన పడుతుండటంతో రోజు రోజుకు హరించుకుపోతు న్నాయి. పట్టణంలోని జయరాంరావువీధిలో ఎన్నో ఏళ్ల క్రితం దేవస్థానంకు చెందిన విలువైన స్థలం ఉండేది. ఎన్నో సంవత్సరాల పాటు స్థలం గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురైంది. పత్రికల్లో కథనాలు రావడంతో మేల్కొన్న అధికారులు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి వదిలేశారు.. అయితే తమకు స్థలం పోయిందంటూ ఓ వృద్ధుడు ఇందులో చిన్నపాటి దుకాణాన్ని పెట్టు కుని నడిపేవారు. అయితే ఇదే స్థలంపై కన్నుపడ్డ ఓ నాయకుడు దీన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని పక్కగా ప్లాన్ వేశాడు. అప్పటికే ఆయన ఓ పార్టీలో చిన్నపాటి నాయకుడుగా ఉండటంతో అక్కడ నుంచి పార్టీ మారిపోతానని, ఇవ్వాల్సినవి ఏమున్నా ఇచ్చుకుంటానంటూ చెప్పడం, పైగా ఆర్థికంగా మంచి స్థితిలో ఉండటంతో మాజీ ప్రజాప్రతినిధి అందుకు పచ్చ జెండా ఊపినట్లు చెబుతున్నారు. ఈ స్థలం వ్యవహారంలో భారీ ఎత్తున నాయకుడికి, కొంతమంది అధికారులకు మామూళ్లు అందినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. వెంటనే సదరు నాయకుడు వైకాపా తీర్థం పుచ్చుకోవడం స్థలం ఆయనకు కేటాయించేడం రెండు జరిగిపోయాయి. ఇందులో బరితెగింపు ఏంటంటే సదరు నాయకుడు దర్జాగా స్థలంలో ఓ హోటల్‌ను నిర్మించేశాడు. కొన్ని రోజుల తర్వాత అధికారులు దీనికి లీజు కేటాయించినట్లు చెబుతున్నారు. అసలు దేవస్థానం ఖాళీ స్థలంలో ప్రైవేటు వ్యక్తి ఏ విధంగా నిర్మాణాలు చేపడుతారో అధికారులు సెలవివ్వాల్సి ఉంది. ఒక వేళ లీజుకు ఇవ్వాలంటే దేవస్థానం నిర్మాణాలు చేపట్టి సదరు స్థలాన్ని టెండర్ పిలిచి లీజుకు కేటాయించాల్సి ఉంటుంది. ఇదంతా ఎంతో ప్రణాళిక ప్రకారం జరగాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ జరగకుండా ఏ విధంగా ఆ స్థలంలో ప్రైవేటు వ్యక్తి నిర్మాణాలు చేపట్టాడని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పార్టీలోకి వస్తాం అంటేనే ప్రభుత్వ స్థలాన్ని దారాదత్తం చేసేస్తారా దీనిపై సదరు నాయకుడు సమాధానం చెప్పాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో తుఫాన్‌సెంటర్ ప్రాంతంలో, రాజీవ్‌నగర్‌లోని దేవుడు బాట ప్రాంతంలో పలువురు నాయకులు అక్రమంగా స్థలాలు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. వీరందరికి సదరు నాయకుడు సూచనలతోనే బరితెగించి ఆక్రమణలకు పాల్పడ్డా రనే విమర్శలు సైతం ఉన్నాయి. ఆలయానికి సంబంధించిన స్థలంలో స్థలం విషయంలో బరితెగించిన అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇంత విలువైన స్థలాన్ని ఏ లెక్కన ఆ పార్టీ నాయకుడికి కట్టబెడ తారంటూ ప్రశ్నిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో ఈ గలీజు బాగోతంపై విచారణ చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీ కైలాసకోన అంగిడలు వేలంపాటలో 1.87 లక్షలు ఆదాయం

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నారాయణ వనం మండలం అరణ్య కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన శ్రీ కైలాసనాథ కోన ప్రతి సంవత్సరం బహిరంగ వేలం పాట పాడేవారు స్థానికంగా చిరుగా పరుస్తులు బహిరంగ వేలంపాటలో పాల్గొని తమ తమ షాపులను దక్కించుకోవడం జరిగింది మొత్తం కలిపి 10 షాపులకు గాను 1 లక్ష 87 వేల రూపాయలు ఆదాయం ఇచ్చినట్టు కైలాస కోన ఈవో కృష్ణ నాయక్ తెలిపారు ప్రతి ఏడాది స్థానికంగానే అంగుర్లు వారే డిపాజిట్లు చెల్లించి వేలం పాటలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు యాదవ్ మాజీ ఛైర్మన్ రామ్ చంద్ర నాయుడు కంద స్వామి నాయుడు మురళి శేఖర్ నాగరాజ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు మెమెంటోలు అందజేత

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక బైరాగి పట్టెడ లోని మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ నందు బైరాగి పట్టెడలోని భవిత సెంటర్ విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 28. మంది ఉత్తీర్ణులైన సందర్భంగా వారి సత్కార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ హాజరయ్యారు. అలాగే ఉప విద్యాశాఖ అధికారి కే బాలాజీ మండల విద్యాశాఖ అధికారి బి భాస్కర్ నాయక్, ఎంజీఎం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ.మురుగన్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ శ్రీమతి తహ సున్నీసా వేమన విజ్ఞాన కేంద్రం ఫౌండర్ పి.నాగార్జున, బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ విద్యార్థులును ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను అటు తల్లిదండ్రులు ఇటు ఉపాధ్యాయులు చక్కగా తీర్చిదిద్ది పదవ తరగతి పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు అభినందనలు, శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమ వితరణ దాత సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహ సున్నీసా మాట్లాడుతూ మా ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఈరోజు భవిత సెంటర్ దివ్యాంగ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా విద్యార్థుల.లో ప్రేరణ కలిగించడానికి సర్టిఫికెట్స్, మెమెంటోలు మా ట్రస్టు ద్వారా అందజేస్తున్నామని ఇది మాకెంతో సంతోషదాయకమని, దివ్యాంగ విద్యార్థులకు మంచి భవిష్యత్తు కలగాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం 28 మంది దివ్యాంగ విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి మరియు ఇతర అధికారులచే మెమెంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయుని కే భవాని, భవిత సెంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎంజీఎం పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎం ముని శారద, బండి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల అన్నప్రసాదం తయారీ ఆధునీకరణకు చర్యలు

టీటీడీ ఈవో జె.శ్యామల రావు

విశాలాంధ్ర-తిరుమల: శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన మరియు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునీకరించాలని దక్షిణ భారతదేశంలోని ప్రఖ్యాత చెఫ్‌లు మరియు పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. శాఖాపరమైన సమీక్షా సమావేశంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ అసోసియేషన్ చెఫ్‌లతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం రుచి, నాణ్యతను మెరుగు పరిచేందుకు ఏర్పాటు చేసిన ప్రముఖ వంటల తయారీ నిపుణుల కమిటీ నుండి పలు సూచనలు, సలహాలు ఆహ్వానించారు. అనంతరం చెఫ్ లు మరియు పాకశాస్త్ర నిపుణులు తమ సూచనలను ఈవోతో పంచుకున్నారు. ఇందులో భాగంగా అన్నప్రసాద భవనంలో సేవలందిస్తున్న సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్ హౌస్ ల్యాబ్ ల ఏర్పాటు చేసి, తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరికరాల యాంత్రీకరణ, ఆహారాన్ని రుచికరంగా, వేగవంతమైన పద్ధతిలో తయారు చేయడం, ప్రతి మూడు నెలలకోసారి ఫుడ్ అనలిస్ట్ వారి సూచనలను తీసుకోవాడం వంటి అనేక సలహాలు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి, మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహార నిపుణులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సమావేశంలో సిఈ శ్రీ నాగేశ్వరరావు, ఎస్ఈ2 శ్రీ జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈవో శ్రీ రాజేంద్ర, స్పెషల్ క్యాటరింగ్ అధికారి శ్రీ శాస్త్రి, జిఆర్ టి గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈఓ విజయ్ విక్రమ్ కోటా, ప్రఖ్యాత చెఫ్ మరియు ప్రెసిడెంట్ – సౌత్ ఇండియా చెఫ్స్ అసోసియేషన్ డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోగచందర్, ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్ –తిరుపతి హెడ్ చెఫ్ శీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్ మరియు డిజైనర్ శ్రీ రితేష్ చౌదరి, శ్రీ దీపక్, శ్రీ నితీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీవీఎస్వో శ్రీ నరసింహ కిషోర్, జీఎం ట్రాన్స్‌పోర్ట్ శ్రీ శేషారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం మరియు ఇతర అధికారులతో రోజువారి వివిధ దర్శనాలపై ఈవో సమీక్షించారు. తిరుమల పరిశుభ్రతపై జేఈవో (విద్య, ఆరోగ్యం) గౌతమితో ఈఓ వర్చువల్ సమావేశం నిర్వహించారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టండి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజుల వసూళ్లలో నయా దందాను మొదలుపెట్టారని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఈ నయ దందాకు చెక్ పెట్టాలని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్యా శివశంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇదే విషయమై ఆర్‌జఓ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శివ శంకర్ నాయక్ మాట్లాడుతూ పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ఎంత డబ్బైనా ఖర్చు పెడతారు అనే ఒక బలహీనతను పరిగణలోకి తీసుకొని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులే కాకుండా మెయింటెనెన్స్ చార్జీలు, పుస్తకాలు యూనిఫామ్ ఇలా వివిధ రకాల పేర్లతో వసూళ్ల దందాకు తెరతీసారన్నారు. ఇకనైనా ఫీజుల నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల మానసిక ఒత్తిడిని తగ్గించాలని ఆర్‌ఐఓను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వినయ్ వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనసైనికులకు సముచిత ప్రాధాన్యతకు కృషి

విశాలాంధ్ర-చంద్రగిరి: రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి కృషిచేసిన జన సైనికులకు సముచిత ప్రాధాన్యత కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు జనసేన పార్టీ ఇంచార్జ్ దేవర మనోహర్ తెలిపారు. మంగళవారం చంద్రగిరి నియోజకవర్గ మండల అధ్యక్షులతో, జనసేన పార్టీ ఇన్చార్జి దేవర మనోహర సమీక్ష నిర్వహించారు. నామినేటెడ్ పదవుల్లో తమ పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ఎన్నికల అనంతరం స్థానిక ఉమ్మడి కూటమి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తినాని గెలిచిన తరువాత మొదటిసారి చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి దేవర మనోహర్ జనసేన స్థానిక మండల అధ్యక్షులతో వారి కార్యాలయంలో సమావేశం అయ్యారు. పార్టీ అధిష్టానాన్ని కలిసిన వెంటనే ఈ సమావేశం ఏర్పాటు చేయడంతో మరింత ఉత్కంఠ భరితంగా ఉండటం విశేషం. ఈ సమావేశంలో ఎన్నికల సమయంలో కష్టపడిన జనసైనికులను గుర్తించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తపస్వి మురళి రెడ్డి, గురునాథ్ తలారి, పగడాల యువరాజ్, సంజీవి హరి, యువ కిషోర్ రాయల్, వెంకట్రాయల్, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బియ్యపు మధు అవినీతిపై న్యాయ విచారణ జరపండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వైసీపీ ప్రభుత్వ పాలనలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూడబెట్టిన అక్రమాస్తులు, సాగించిన అవినీతి, అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ డిమాండు చేశారు. తాను అధికారంలోకి వస్తే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతానని ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీస్, రెవెన్యూ, ఆలయం, ఇంకా పలు ప్రభుత్వ శాఖల అధికారులను దళారులుగా మలుచుకుని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సాగించిన అవినీతి దందాకు హద్దే లేకుండా పోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, ఆయన బంధువులు, అనుచరులు కలిసి రైతుల పొట్టగొట్టారని ఆరోపించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటరత్నం కూడా మాజీ ఎమ్మెల్యే, ఆయన పీఏ అవినీతిపై విచారణ జరపాలని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకుడు మోహన్ నాయుడు పాల్గొన్నారు.

దక్షిణ కైలాస్ నగర్‌లో భారీ చోరీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కైలాసనగర్లో సోమవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఓ ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలో దాచిన రూ.3.50 లక్షల నగదు, 40 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకుని పోయారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ రారాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దక్షిణ కైలాస నగర్ లో ని ఓ అద్దె ఇంట్లో సిరాజ్ మిషా అనే మహిళ తన కుమారుడితో కలిసి నివాసం ఉంటోంది. ఆదివారం సాయంత్రం కుమారుడితో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్ళింది. ఈ నేపథ్యంలో పక్కాగా రెక్కీ వేసిన గుర్తుతెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి కట్టర్ల సాయంతో తాళాలను కత్తిరించి లోనికి ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.3.50 లక్షల నగదు, 40 సవర్ల బంగారాన్ని దోచుకుపోయారు. మంగళవారం ఉదయం సిరాజ్ మిషా ఇంటి తాళాలు తెరిచి ఉండడం చూసి స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. చెన్నై నుంచి హుటాహుటిన దక్షిణ కైలాస్ నగర్ కు చేరుకున్న సిరాజ్ మిషా ఇంట్లో చోరీ జరిగిందన్న విషయం తెలుసుకుంది. ఆ మేరకు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ కూడా దుండగుల ఆచూకీ కోసం ప్రయత్నించింది. బాధితురాలు సిరాజ్ మిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ రారాజు తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట

విశాలాంధ్ర - కుప్పం : ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయం. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యుల భారీ ఊరట లభించింది అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు, అధికారంలోకి వచ్చి నెల రోజుల లోపే అమలులోకి తెచ్చారని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఫ్రీ శాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం జరిగిందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తెలుగుదేశం విధానమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, కుప్పం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పి.ఎస్ మునిరత్నం, రాజ్ కుమార్, సత్యేంద్ర శేఖర్, వెంకటేష్, మంజునాథ్, గోపి, అర్ముగం, గిరి తదితరులు పాల్గొన్నారు.

తలనీలాలు వేలంపాట వాయిదా

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం స్కంద పుష్కరిణి కుమారగిరి వెలసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామి సంబంధించిన ఆడికృతిక మహోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి మంగళవారం మధ్యాహ్నం బహిరంగ వేలం పాట దేవాదాయ శాఖ ఈవో ఎం కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలం పాటకు ముందుకు ఎవరు రాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

24 గంటల్లోపు చోరీకేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం ముస్లిం కాలనీలో ఈ నెల 7వ తేది జరిగిన చోరీ కేసును జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఆదేశాల మేరకు 24 గంటల్లో సీ.ఐ సత్యబాబు, తమ సిబ్బందితో కలసి ఛేదించినట్లు నగరి డీఎస్పీ ఎం, ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం సీ.ఐ కార్యాలయం ఆవరణంలో ముద్దాయిని అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.ఎన్ మూర్తి మాట్లాడుతూ కార్వేటినగరం పట్టణంలోని ముస్లిం కాలనీకి చెందిన మహబూబ్ భాషా తమ కుటుంబ సభ్యులతో పీలేరులోని తమ సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకోవడంతో ఇంటిలో దొంగ తనం జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాధు చేశారు. దీంతో సీ.ఐ సత్యబాబు తమ సిబ్బంది రాజశేఖర్, భాస్కర్, గవాస్కర్తో కలిసి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. దీంతో అదే కాలనీలోని పాత సంతవీధికి చెందిన డి. ఖాధర్భాష కుమారుడు ఢంఖా జాఫర్(30)పై అనుమానం వచ్చి మంగళవారం చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారి సమీపంలోని బంగారమ్మ ఆలయం వద్ద ఉన్నగుర్తించి అదుపులోకి తీసుకుని తనదైన శైలిలో విచారణ చేపట్టగా పట్టపగలే ఇంటి తాళాలు పగల గొట్టి బెడ్ రూంలోని బీరువాను పగల గొట్టి అందులోని రూ.5లక్షల 40 వేలు నగదు. 176 గ్రాములు బంగారం ఆభరణాలు, అర కేజీ వెండి ఆభరణాలను అపహరించినట్లు అంగీకరించాడని పేర్కొన్నారు. అతని వద్ద వద్ద ఉన్న రూ. 14 లక్షల25 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకుని ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ 24 గంటల్లో చోరీ కేసును చేదించి, వస్తువులను రికవరీ చేసినందుకు సీ.ఐ సత్యబాబు, సిబ్బంది గవాస్కర్, భాస్కర్, రాజశేఖర్ ను అభినందిస్తూ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రివార్డునుముద్దాయిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీ.ఐ చోరీకి గురైన నగదు, బంగారు ఆభరణాలు.

ఆలయ అభివృద్ధికి షాపు వితరణ

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్ : నారాయణవనం మండల అరణ్య కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన కైలాస కోనలో వెలసిన శ్రీ కైలాసనాథునికి ఆలయ అభివృద్ధికి గత ఏడాదిలో చిరు అంగడి ఏర్పాటు చేసిన సంజీవ్ తన సొంత ఖర్చులతో 2 లక్షల 75 వేల రూపాయలతో ఖర్చుతో నిర్మించి ఎండోమెంట్ వారికి మంగళవారం ఉదయం శ్రీ కైలాస కోన బహిరంగ వేలంపాట సందర్భంగా సంజీవ్ ఆయన స్వయంగా స్థానికంగా నాయకులు ఇవో కృష్ణ నాయక్ గ్రామ సమక్షంలో సంజీవ షాపుని అప్పగించారు. వెంటనే గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మర్యాదలు పూలమాల సాల్వతో సత్కరించారు ఇలా కొంతమంది దాతలు ముందుకొస్తే శ్రీ కైలాస కోన అభివృద్ధి చెందుతుందని పలువురు హర్షం ధనియాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాసులు మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు కందస్వామి నాయుడు రమేష్ మురళి వెంకటేష్ నాగరాజ్ ఆలయ సిబ్బంది లో నారాయణ బాలయ్య శీను గోవిందయ్య శేఖర్ ముత్తు రామయ్య తదితరులు పాల్గొన్నారు

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

అధికారులు ఎప్పటికప్పుడు పరిశ్రమల తనిఖీ చేపడుతూ పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి : పరిశ్రమలలో నిబంధనల మేరకు భద్రతా ప్రమాణాలు పాటించాలని, అధికారులు పరిశ్రమల తనిఖీ ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ పర్యవేక్షించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలలో భద్రత చర్యలపై కలెక్టర్ సమీక్షిస్తూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలు, వాటిపై పర్యవేక్షణ ఉండాలని, ప్రమాదాల నివారణకు తరచూ సంబంధిత అధికారులు సేఫ్టీ మెజర్మెంట్ పై పరిశ్రమల్లో అవగాహన కలిగించి అప్రమత్తం చేసి తప్పని సరిగా నిబంధనలు అమలు జరిగేలా చూడాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎ కేటగిరీ కింద 12 మేజర్ యాక్సిడెంట్ హజార్డ్స్ పరిశ్రమలు, బి1 కేటగిరీ కింద 59 పరిశ్రమలు, 2 కేటగిరీ కింద 48 పరిశ్రమలు ఉన్నాయని వాటిని తనిఖీ చేయడం జరిగిందని, మెరుగైన భద్రత ప్రమాణాల అమలు కొరకు నోటీసులు ఇవ్వడం జరిగిందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి చంద్రశేఖర్, జడ్ఎం, ఏపీఐఐసి స్పెషల్ జోన్ తిరుపతి విజయరత్నం, ఇఇ కాలుష్య నియంత్రణ మండలి అశోక్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య తదితర అధికారులు, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులకు అడ్డుకట్ట

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచండి : కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : నగరంలోని ప్రతి ఒక్కరూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు మన దరిచేరవని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తిమ్మినాయుడు పాలెం, హరిజన వాడ, రెడ్డిగుంట, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్ అధికారు లతో కలిసి మంగళవారం తెల్లవారుజాము నుండి కమిషనర్ పారిశుధ్య పనులు, త్రాగునీటి సరఫరాను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా నగరపాలక సంస్థ తరపున ఎన్ని చర్యలు చేపట్టిన వాటికి ప్రజల సహకారం కూడా ఉండాలని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, మీ.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. తద్వారా విష జ్వరాలు, అంటువ్యాధులకు కారణమైన దోమలు, తదితరాలు పెరగకుండా ఉంటాయని అన్నారు. ముఖ్యంగా ఇండ్ల వద్ద ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు సూచించారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే వ్యాధులు రాకుండా అడ్డుకట్ట చేయగలమని ప్రజలు తమకు సహకరించాలని కోరారు. మురుగునీటి కాలువల్లో ఎక్కడా చెత్త ఉండకుండా, లార్వా పెరగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలనీ సిబ్బందిని ఆదేశించారు. కాలువల్లో, గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, మలేరియా మందులు పిచికారీ చేయాలని, బ్లీచింగ్ చల్లాలని సిబ్బందికి చెప్పారు. నగరంలో ఎక్కడా త్రాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతీ, తదితరులు ఉన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి

సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు

విశాలాంధ్ర - చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు జూలై 10 నుండి 12వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. జూలై 10న పెద్ద శేష వాహనం, జూలై 11న హనుమంత వాహనం, జూలై 12న గరుడ వాహనంపై స్వామివారు రాత్రి 7 నుండి 8 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.జూలై 13న పార్వేట ఉత్సవం :శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాల మరుసటి రోజైన జూలై 13వ తేదీన పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 7 నుండి ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆస్థానం, పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు.ఆర్జిత సేవలు రద్దు :జూలై 11వ తేదీన తిరుప్పావడసేవ, జూలై 10 నుండి 13వ తేదీ వరకు ఆర్జిత కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది.టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.చారిత్రక ప్రాశస్త్యం: క్రీ.శ 14వ శతాబ్దం నుండి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలు ప్రారంభమైనట్లు శాసనాధారాల ప్రకారం తెలుస్తోంది.క్రీ.శ 1433వ సంవత్సరంలో చంద్రగిరిని పాలించిన విజయనగర రాజుల వంశానికి చెందిన రెండవ దేవరాయ తిరుమలలో క్రమపద్ధతిలో వేదపారాయణం చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇది బహుళ ప్రజాదరణ పొందింది. ఈ విషయాన్ని ఆలయాధికారి తెలుసుకుని సిద్దకోట్టై అని పిలవబడే శ్రీనివాసపురానికి(ఇప్పుడు శ్రీనివాసమంగాపురం) చెందిన 24 మంది మహాజనులను స్వామివారి ఆస్థానంలో వేదాలను పారాయణం చేసేందుకు నియమించారు. దీనికి ఆమోదం తెలిపిన రాజుగారు ఇందుకయ్యే ఖర్చు కోసం తన రాజ్య పరిధిలోని సిద్దకోట్టై గ్రామం నుండి రాజ్య భాండాగారానికి వచ్చే సొమ్ములో అర్ధ భాగాన్ని మంజూరు చేశారు.అనంతరం శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల మనవడైన శ్రీ తాళ్లపాక చిన తిరుమలాచార్యులు శ్రీ కళ్యాణ వేంకటేశ్వరుడి ఆలయానికి జీర్ణోద్ధరణ చేసి స్వామివారికి పూజలను తిరిగి ప్రారంభించారు. ఈ క్రమంలో క్రీ.శ 1540లో చంద్రగిరిని పాలించే అచ్యుతరాయలు మంగాపురం గ్రామాన్ని సర్వమాన్య అగ్రహారం(పన్నులేని భూమి)గా శ్రీ తాళ్లపాక చిన తిరుమలాచార్యులకు అందజేశారు. అనంతరం క్రీ.శ 1780లో ముస్లిం రాజులు ఈ ఆలయాన్ని లూటీ చేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం, గర్భాలయ గోపురం, విగ్రహాలను పూర్తిగా ధ్వంసం చేశారు. పాక్షికంగా ధ్వంసమైన కొన్ని విగ్రహాలు ప్రస్తుతం చంద్రగిరికోటలో భారత ప్రభుత్వ పురావస్తు శాఖ సంరక్షణలో ఉన్నాయి. 1920వ సంవత్సరంలో బ్రిటీషు ప్రభుత్వం ఈ ఆలయాన్ని జాతీయ పురాతన కట్టడంగా గుర్తించి భారత ప్రభుత్వ పురావస్తు శాఖ పరిధిలోకి తెచ్చింది. అప్పటి నుండి ఈ ఆలయం భారత ప్రభుత్వ పురావస్తు శాఖ రక్షిత కట్టడాల జాబితాలో ఉంది.తరువాత 1940వ సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన మధ్వ బ్రాహ్మణుడు సుందరరాజ మంగాపురానికి వచ్చి శ్రీనివాసుడు తనకు కలలో కనిపించాడని తెలిపారు. "శ్రీనివాసమంగాపురంలో ఉన్న నాకు ధూపదీప నైవేద్యాలు కరువయ్యాయి. నా ఆలయానికి పూర్వ వైభవం కల్పించు" అని స్వామి ఆదేశించారని వివరించారు. అనంతరం గ్రామపెద్దలైన వెంకటకృష్ణయ్య, నరసింగాపురం రెడ్డివారి నాథమునిరెడ్డి, గుర్రప్ప ఆచారి మరియు తొండవాడ మొగిలి సుందరరామిరెడ్డి తదితరులను సుందరరాజ కలిసి స్వామివారు తనకు కలలో కనిపించిన విషయాన్ని వివరించి సాయం చేయాలని కోరారు. ఆ సమయంలో ఆలయం మొత్తం ముళ్లపొదలు, చీమలపుట్టలు, విషపు కీటకాలు, పాములతో నిండి గోపురాలు కూలిపోయే స్థితిలో ఉండేది. గ్రామపెద్దల సాయంతో సుందరరాజ ముళ్లపొదలు, చీమలపుట్టలను తొలగించి ఆలయాన్ని పరిశుభ్రం చేశారు. స్వామివారు కలలో సూచించిన విధంగా 1940 జులై 11న ఆషాడ శుద్ధ షష్ఠి రోజున తొలిపూజ చేశారు. అదేవిధంగా అర్చకుడైన సుందరరాజుకు స్వామివారు కలలో కనిపించి చెప్పిన విధంగా టీటీడీ అప్పటినుండి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహిస్తోంది. అలాగే మొదటి పూజను నిర్వహించిన ఆషాడ శుద్ధ షష్ఠి రోజున "సాక్షాత్కార వైభవం" పేరిట టీటీడీ ప్రతి ఏడాదీ ఉత్సవం నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాన్ని బ్రహ్మోత్సవాల కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి టీటీడీ నిర్వహిస్తుండడం విశేషం.

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర -చిత్తూరు : నగర పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే, మేయర్ ఎస్ అముద, కమిషనర్ అరుణ, టిడ్కో అధికారులతో కలిసి పూనేపల్లె వద్దనున్న టిడ్కో గృహాలను సందర్శించారు. గృహ సముదాయంలో గృహాలను, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పెండింగ్ పనులపై టిడ్కో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2017-18లో పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఉద్దేశంతో టిడ్కో గృహాలకు శ్రీకారం చుట్టి పట్టాల పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం టిడ్కో సముదాయంలో 2వేల గృహాల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి త్వరలోనే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన గృహాల్లోనూ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని టిడ్కో అధికారులు, గుత్తేదారులను ఆదేశించినట్లు చెప్పారు. గృహ సముదాయంలో ప్రజలకు మెరుగైన నీటి సరఫరా వ్యవస్థ, లైటింగ్, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కార్పొరేటర్లు, ఇతర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటి, వడమాలపేట, నగరి, నాగలాపురం, డక్కిలి, విరాల,
రామచంద్రాపురం, సదుం, యాదమరి, వరదయ్యపాళెం
బంగారుపాలెం, రొంపిచెర్ల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9490952134